సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 1 । డిసెంబర్ । 2023



సోమశిలలో 29.644 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 29.644 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి పైతట్టు ప్రాంతాల నుంచి 2,720 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	-రూ.64,660
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	- రూ.5,807
3 శాతం జీఎస్టీతో..	- రూ.5,981
సవర (8 గ్రా)	- రూ.47,848

గరిష్ఠం/కనిష్ఠం
29.9 /23.8

వాతావరణం

గురువారం గాలిలో తేమ 100 శాతం ఉంది. జిల్లావ్యాప్తంగా పలుచోట్ల వర్షం కురిసింది. శుక్రవారం కూడా జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ప్రక్రియను శుక్రవారం నుంచి నిర్వహించేలా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లావ్యాప్తంగా 3,17,776 మంది లబ్ధిదారులకు రూ.88.32 కోట్ల నగదును పంపిణీ చేయనున్నారు. అధికారులు సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు పింఛన్ నగదును అందజేశారు. వలంటీర్లు ఉదయాన్నే లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ నగదు అందజేయనున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న మంత్రి కాకాణి

నెల్లూరు(దర్గామిట్ట): కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి రూ.5 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అందజేశారు. గురువారం నెల్లూరులోని డైకస్ రోడ్డులో ఉన్న మంత్రి క్యాంపు కార్యాలయంలో వెంకటాచలం మండలం కురిచెర్లపాడు గ్రామానికి చెందిన రైతు వడ్లమూడి సురేష్‌కు మంత్రి చెక్కును అందజేశారు. సురేష్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఇటీవల వైద్యం చేయించుకోగా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.5 లక్షలు మంత్రి మంజూరు చేయించారు. తనకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థికసాయం అందించిన మంత్రికి సురేష్ ధన్యవాదాలు తెలిపారు.

ఛత్తీస్‌ఘడ్ ఓట్ల లెక్కింపు పరిశీలకుడిగా డీఆర్వో లవన్న

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.లవన్నను ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం శక్తి జిల్లా జైజైపూర్ నియోజకవర్గ ఎన్నికల లెక్కింపు పరిశీలకుడిగా నియమిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. డిసెంబర్ 3వ తేదీ జైజైపూర్ ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో పరిశీలకుడిగా డీఆర్వో లవన్నను నియమించారు.

కసురు మీద సముద్రం



మైపాడు తీరంలో ఎగిసిపడుతున్న అలలు

ఇందుకూరుపేట: అల్పపీడన ప్రభావంతో సముద్రం కసురు మీద ఉండడంతో తీరంలో అలలు ఎగసి పడుతున్నాయి. ఇప్పటికే వేటకు తాత్కాలికంగా స్వస్తి పలికిన మత్స్యకారులు తమ వేట సామగ్రిని తీరంలో భద్రపరుచుకున్నారు. కాగా ఇందుకూరుపేట మండలంలో గురువారం ఓ మోస్తరు వర్షం కురిసింది. వ్యవసాయ పనులకు కాస్త ఆటంకం కలిగింది.



పింఛన్ కానుక.. మరువమిక

మలివయస్సులో అవ్వాతాతలకు రాష్ట్ర ప్రభుత్వం ఆసరాగా నిలుస్తోంది. గత ఎన్నికల సమయంలో చెప్పినట్లుగానే ఏటా పింఛన్ నగదును పెంచుతూ వస్తోంది. వచ్చే జనవరికి మరో రూ.250 పెంచి రూ.3,000 అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇచ్చిన మాట నెరవేరుస్తూ తమకు భరోసా ఇస్తున్న ఈ ప్రభుత్వాన్ని తాము మరువమని అవ్వాతాతలు చెబుతున్నారు.

వైఎస్సార్ పింఛన్ నగదు రూ.3 వేలకు పెంపు

- వచ్చే జనవరి నుంచి అమలు
- అవ్వాతాతలకు సంక్రాంతి కానుకగా అందజేత
- రూ.250 పెంచుతున్న ప్రభుత్వం
- ఇప్పటికే దివ్యాంగులకు రూ.3 వేలు



వింజమూరు పట్టణంలోని సచివాలయం-5లో ఇటీవల కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు పెన్షన్ పత్రాలు అందజేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు (ఫైల్)

ఉదయగిరి: అధికారం కోసం ఎన్నికల సమయంలో ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ఆ హామీలను మర్చిపోవడం గత పాలకుల తీరు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అందుకు భిన్నంగా మేనిఫెస్టోలో చెప్పిన ప్రతి హామీని నెరవేరుస్తూ ప్రజల ఆదరాభిమానాలను పొందుతున్నారు. హామీల అమలులో భాగంగా ప్రస్తుతం అవ్వాతాతలకు అందిస్తున్న వైఎస్సార్ పింఛన్ కానుక నగదు రూ.2,750ని మరో రూ.250 పెంచి మొత్తం రూ.3,000 అందించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ మొత్తాన్ని వచ్చే జనవరి నుంచి అందించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటన చేశారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్న ముఖ్యమంత్రిని పింఛన్‌దారులు అభినందిస్తున్నారు. ఇప్పటికే దివ్యాంగులకు రూ.3 వేలు, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రూ.10 వేలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి రూ.5 వేలు చొప్పున పింఛన్ నగదు అందజేస్తూ ప్రభుత్వం మానవత్వం చాటుకుంటోంది. అంతేకాక లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వలంటీర్లే ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 5వ తేదీ వరకు వారి ఇంటికే వెళ్లి పింఛన్ నగదును అందించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఈ విధానాన్ని పక్కాగా అమలు చేస్తోంది. అనారోగ్యంతో ఆస్పత్రుల్లో ఉన్న వారికి వలంటీర్లు మానవతా దృక్పథంతో వారు చికిత్సపొందుతున్న చోటుకే వెళ్లి పింఛన్లు అందిస్తున్నారు.

పింఛన్.. తొలి సంతకం

2019లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.2 వేలు ఉన్న పింఛన్‌ను రూ.250 పెంచుతూ ఫైల్‌పై తొలి సంతకం చేశారు. అప్పటి నుంచి ప్రతి ఏటా రూ.250 వేల చొప్పున పెంచుతూ ప్రస్తుతం రూ.2,750 చొప్పున లబ్ధిదారులకు అందజేస్తున్నారు. వచ్చే జనవరి నుంచి మరో రూ.250 వేలు పెంచి ఎన్నికల సమయంలో ఇచ్చిన రూ.3 వేల హామీని పూర్తిస్థాయిలో అమలు చేయనున్నారు. గతంలో టీడీపీ అధికారంలోకి వచ్చేందుకు ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు అనేక అబద్ధపు హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో నెరవేర్చకుండా విస్మరించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి హామీని నెరవేరుస్తూ ప్రజాభిమానాన్ని చూరగొన్నారు.

జిల్లాలో లబ్ధిదారులు

జిల్లాలో ప్రతి నెలా లబ్ధిదారులకు పింఛన్ కానుక నగదును ప్రభుత్వం అందజేస్తోంది. అయితే ప్రతి ఆర్నెల్లకోసారి పింఛన్ కానుకకు అర్హులైన వారిని ఎంపిక చేసి వారికి పింఛన్లు ఇచ్చే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. అందులో భాగంగా జిల్లాలో అక్టోబర్ నెలలో 10,158 కొత్త పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటితో కలిపి ప్రస్తుతం 3,17,776 మంది పింఛనుదారులు ఉన్నారు. వీరికి మొత్తం రూ.88.32 కోట్లు పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం అందజేస్తున్న పింఛన్ నగదు రూ.2,750కు జనవరి నెల నుంచి మరో రూ.250 పెంచిన రూ.3 వేల చొప్పున అందించేలా ప్రభుత్వం ప్రకటించింది. దీంతో జిల్లాలో రూ.95.48 కోట్లు ప్రతి నెలా పింఛన్‌దారులకు అందనుంది. జిల్లాలో పెరుగుతున్న పింఛన్ నగదు కోసం ప్రభుత్వం అదనంగా మరో రూ.7.45 కోట్లు కేటాయించింది.



వరికుంటపాడు మండలం నారసింహాపురంలో బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్ (ఫైల్)

జిల్లాలో..

ప్రస్తుతం పింఛన్ కానుక లబ్ధిదారులు - 3,17,776 మంది

అందజేస్తున్న నగదు - రూ.88.32 కోట్లు

జనవరి నుంచి అందించనున్న పింఛన్ - రూ.3 వేలు

అందజేయనున్న మొత్తం నగదు - రూ.95.48 కోట్లు

గత ప్రభుతానికి భిన్నంగా..

గత టీడీపీ ప్రభుత్వంలో సార్వత్రిక ఎన్నికలకు నాలుగు నెలల ముందు వరకు పింఛన్‌దారులకు నెలకు రూ.1,000 ఇచ్చేవారు. అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్రలో భాగంగా పాదయాత్ర చేస్తూ అవ్వాతాతల ఇబ్బందులను స్వయంగా గమనించి అధికారంలోకి వచ్చిన వెంటనే సామాజిక పింఛన్లు ఏటా కొంత మొత్తం పెంచుకుంటూ రూ.3 వేల వరకు ఇస్తామని ప్రకటించారు. దీంతో అప్పటి సీఎం చంద్రబాబు హడావుడిగా 2019 సార్వత్రిక ఎన్నికలకు నాలుగు నెలల ముందు ఈ పింఛన్ నగదును రూ.2 వేలకు పెంచారు. అయితే 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఈ పింఛన్ నగదును ప్రతి ఏటా పెంచుతూ ప్రస్తుతం రూ.2,750 ఇస్తోంది. వచ్చే జనవరి నుంచి రూ.3 వేలు ఇవ్వనుంది.

కొత్త ఏడాది కానుక



వైఎస్సార్ పింఛన్ కానుక వచ్చే జనవరి నుంచి రూ.250 పెంచి కొత్త ఏడాదిలో సంక్రాంతి కానుకగా రూ.3 వేల చొప్పున ప్రభుత్వం అందించనుంది. ప్రస్తుతం జిల్లాలో 3,17,776 మంది లబ్ధిదారులకు రూ.88.32 కోట్ల పింఛన్ నగదు పంపిణీ చేస్తున్నాం. పెరిగిన మొత్తంతో కలిపి వచ్చే నెల నుంచి 95.45 కోట్లు ప్రభుత్వం అందజేయనుంది.

– సాంబశివారెడ్డి, పీడీ, డీఆర్‌డీఏ

దశాబ్దాల పేద రైతుల కల సాకారం

- రైతుల పేరుతో భూ పట్టాలు
- అందజేసిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



లబ్ధిదారుకు భూపట్టా అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: దశాబ్దాల పేద రైతుల కలలను సాకారం చేస్తూ సొంత భూమి లేని పేదలకు రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా భూ పట్టాలు పంపిణీ చేస్తోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మనుబోలులోని సీపీఆర్ కల్యాణ మండపంలో గురువారం 859 మంది లబ్ధిదారులకు 1,027 ఎకరాలకు సంబంధించిన భూ పట్టాలను మంత్రి కాకాణి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా ఎలాంటి హక్కులు లేకుండా పేద రైతులు సాగు చేసుకుంటున్న భూములకు సంపూర్ణ హక్కులు కల్పించాలన్న ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. జిల్లావ్యాప్తంగా 6,500 ఎకరాలకు పట్టాల పంపిణీ చేపట్టగా, అందులో ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోని 5 మండలాల పరిధిలో 5,023 ఎకరాలకు పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రూ.కోట్ల విలువ చేసే భూములపై రైతులకు హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం వారి భవిష్యత్తుకు భరోసా ఇస్తుందన్నారు. కొమ్మలపూడి వద్ద హైవే పక్కన రూ.60 కోట్ల విలువ చేసే భూమిని 70 మంది గిరిజనులకు, ఇస్లాంపేటలో 86 ఎకరాలను 152 మందికి, సర్వేపల్లిలో 7.67 ఎకరాల్లో 30 మందికి పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కుడితిపల్లిలో ఇనాం భూములను సెటిల్మెంట్ చేసి సర్వే చేస్తున్నారని, సంక్రాంతికి పట్టాలు అందజేస్తామని తెలిపారు.

సోమిరెడ్డికి దిక్కుతోచడం లేదు

ఈ ఏడాది సాగునీరు అందక ఈ ప్రాంతంలో పంటలు ఎండిపోతే దాన్ని అడ్డంపెట్టుకుని రాజకీయం చేయాలని చూసిన సోమిరెడ్డికి ఇప్పుడు దిక్కు తోచడం లేదని కాకాణి ఎద్దేవా చేశారు. అడిగిన వెంటనే సీఎం కండలేరు నుంచి 2 టీఎంసీల నీటిని కేటాయించడం, ఆ వెంటనే వర్షాలు కురుస్తుండడంతో ఈ ప్రాంత రైతులంతా సంతోషంగా ఉంటే ఒక్క సోమిరెడ్డి మాత్రమే బాధపడిపోతున్నారన్నారు. సర్వేపల్లిలో ఇంత పెద్ద ఎత్తున పట్టాలు ఎలా ఇస్తారంటూ కలెక్టర్‌ను బెదిరించేలా సోమిరెడ్డి దిగజారిపోయాడని దుయ్యబట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివకృష్ణయ్య, ఎంపీడీఓ ప్రసాద్, ఎంపీపీ వజ్రమ్మ, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లో వర్షానికి జలమయమైన రహదారి

జిల్లాలో 21.3 మి.మీ. వర్షపాతం

నెల్లూరు(దర్గామిట్ట): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గురువారం జిల్లాలో కురిసిన వర్షానికి నెల్లూరు నగరంలోపాటు పలు మండలాల్లో రోడ్లు జలమయమయ్యాయి. జిల్లాలో సగటున 21.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. గరిష్టంగా కలువాయి మండలంలో 79.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. అలాగే మనుబోలులో 45.8, కొండాపురంలో 45.4, గుడ్లూరులో 43.8, జలదంకిలో 35.2, నెల్లూరు అర్బన్‌లో 35.2, ముత్తుకూరులో 33.6, వెంకటాచలంలో 32.6, కావలిలో 28, దగదర్తిలో 26.4, ఇందుకూరుపేటలో 25.8, పొదలకూరులో 25.4, మర్రిపాడులో 24.6, రాపూరులో 24.4, వరికుంటపాడులో 22.8, సైదాపురంలో 22.4, కందుకూరులో 22.2, వింజమూరులో 21.2, నెల్లూరురూరల్‌లో 20.4, తోటపల్లిగూడూరులో 19.6, అనంతసాగరంలో 16.4, కలిగిరిలో 16.2, చేజర్లలో 14.4, కోవూరులో 12.2, ఉలవపాడులో 11.2, బోగోలులో 10.6, దుత్తలూరులో 10.4 మి.మీ. వర్షపాతం నమోదైంది.

మారుతాళాలతో బైక్ దొంగతనాలు

- అంతర్ జిల్లాల దొంగ అరెస్ట్
- రూ.10.04 లక్షల విలువ చేసే 22 బైక్‌లు స్వాధీనం
- నిందితుడిపై సస్పెక్టెడ్ షీట్ తెరుస్తామన్న ఎస్పీ



స్వాధీనం చేసుకున్న బైక్‌లతో ఎస్పీ, పోలీసు అధికారులు

నెల్లూరు(క్రైమ్): అతడు జల్సాగా జీవించాలనుకున్నాడు. అయితే తన సంపాదన అంతంతమాత్రంగా ఉండడంతో బైక్ దొంగతనాలపై దృష్టి సారించాడు. మారుతాళాలతో బైక్‌లను అపహరించి వాటిని అమ్మి సొమ్ముచేసుకుని జల్సా చేయసాగాడు. సదరు అంతర్ జిల్లాల దొంగ కదలికలపై నిఘా ఉంచిన నెల్లూరు రూరల్ పోలీసులు గురువారం నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 22 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి నిందితుడి వివరాలను వెల్లడించారు. తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం తమ్మినపట్నం గ్రామానికి చెందిన ఎస్.మల్లికార్జున అలియాస్ మల్లి పదో తరగతి వరకు చదువుకున్నాడు. ఆపై వ్యవసాయ పనులు చేసుకుంటూ కారు డ్రైవింగ్ నేర్చుకున్నాడు. అతనికి ఆరేళ్ల క్రితం వివాహం కాగా కుటుంబ కలహాల నేపథ్యంలో ఏడాదికే భార్య అతనిని వదిలి వెళ్లిపోయింది. అప్పటి నుంచి జల్సాలకు, చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. కారు డ్రైవింగ్, సెంట్రింగ్ పనులు చేసుకుంటూ వచ్చిన సంపాదనతో జల్సాలు చేయసాగాడు. రెండేళ్ల క్రితం నెల్లూరుకు వచ్చాడు. కొత్తూరు సమీపంలో నివాసం ఉంటూ బైక్ దొంగతనాలపై దృష్టి సారించాడు. మారుతాళాలను తయారు చేయించాడు. తొలిసారిగా 2022 జనవరిలో వేదాయపాళెంలో ఓ బైక్‌ను దొంగలించాడు. తనపై ఎవరికీ అనుమానం రాకుండా ఏడాదిపాటు సెంట్రింగ్ పనులు చేశాడు. ఈ ఏడాది మార్చి నుంచి తిరిగి బైక్ దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. నెల్లూరు నగర పరిధిలోని బస్టాండ్లు, ఆస్పత్రులు, షాపింగ్‌మాల్స్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాలతోపాటు తిరుపతి జిల్లా కోటలో బైక్‌లను దొంగిలించాడు. వాటిని జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తక్కువ ధరకు అమ్మి జల్సాలు చేయసాగాడు.

నిందితుడి గుర్తింపు ఇలా..

ఎస్పీ ఆదేశాల మేరకు నెల్లూరు రూరల్ డీఎస్పీ పి.వీరాంజనేయరెడ్డి పర్యవేక్షణలో బైక్ దొంగతనాలపై నిఘా ఉంచేలా నెల్లూరు రూరల్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసులురెడ్డి తన సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. నెల్లూరు రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన బైక్ దొంగతనం కేసు విచారణలో స్థానికంగా ఉన్న సీసీ ఫుటేజ్‌లను పరిశీలించగా నిందితుడి ఆనవాళ్లు లభ్యమయ్యాయి. సాంకేతికత ఆధారంగా నిందితుడు మల్లికార్జునగా పోలీసులు గుర్తించి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో గురువారం కాకుపల్లి వద్ద నిందితుడు ఉన్నాడన్న పక్కా సమాచారం అందుకున్న రూరల్ ఇన్‌స్పెక్టర్ ప్రత్యేక బృందంతో వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు.



ఇన్‌స్పెక్టర్‌కు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

22 బైక్‌లు స్వాధీనం

నిందితుడిని పోలీసులు తమదైన శైలిలో విచారించగా నెల్లూరు రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో 5, చిన్నబజారు పోలీసుస్టేషన్ పరిధిలో 4, నవాబుపేట పోలీసుస్టేషన్ పరిధిలో 2, సంతపేట పరిధిలో 2, దర్గామిట్ట పరిధిలో 3, వేదాయపాళెం పరిధిలో 2, తిరుపతి జిల్లా కోట పోలీసుస్టేషన్ పరిధిలో 2, మరోచోట 2 మొత్తంగా 22 బైక్‌లను దొంగిలించినట్లు తెలిపాడు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 20 కేసుల్లో రూ.10.04 లక్షల విలువ చేసే 22 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న 22 బైక్‌లలో 3 బైక్‌లు మినహా మిగిలినవన్నీ ఒకే కంపెనీకి చెందినవి కావడం గమనార్హం. నిందితుడిపై సస్పెక్టెడ్ షీటు తెరవనున్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసిన సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. సమావేశంలో ఏఎస్పీ క్రైమ్స్ ప్రసాద్, నెల్లూరు రూరల్ డీఎస్పీ పి.వీరాంజనేయరెడ్డి, ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసులురెడ్డి, ఎస్సై బి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య

కావలి: వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలోని ఓ లాడ్జిలో చోటుచేసుకుంది. కావలి ఒకటో పట్టణ సీఐ శ్రీనివాసరావు వివరాల మేరకు.. పట్టణంలోని జనతాపేటకు చెందిన కొండా హరిప్రసాద్‌రెడ్డి (57) హైదరాబాద్‌లోని జీడిమెట్లలో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో లాడ్జిలో దిగారు. తన వెంట తెచ్చుకున్న చున్నీని సీలింగ్ ఫ్యాన్‌కు బిగించుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కాగా ఆస్తుల విషయంలో సమస్యలతో మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డారని భార్య తెలిపారన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి మహిళ..

గూడ్స్ రైలు కిందపడి గుర్తుతెలియని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. మృతురాలికి సుమారు 55 నుంచి 60 ఏళ్ల ఉండొచ్చని భావిస్తున్నారు. గోధుమ రంగు లంగా, ఎరుపు రంగు జాకెట్, టెరికాటన్ పూలు కలిగిన పసుపు, బ్లూ రంగు చీరను ధరించి ఉన్నారు. గూడ్స్ రైలు గార్డు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని కావలి జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు తెలిపారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.85
లేయర్	రూ.95
బ్రాయిలర్ చికెన్:	రూ.160
స్కిన్‌లెస్ చికెన్:	రూ.180
లేయర్ చికెన్:	రూ.162

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.45
సన్నవి : రూ.25
పండ్లు : రూ.8



అపోహలు తొలగిద్దాం.. అవగాహన పెంచుకుందాం

ఎయిడ్స్.. ఈ పేరు వింటేనే ఒకప్పుడు గడగడలాడిపోయే పరిస్థితి. వ్యాధి తీరుతెన్నులు.. సంక్రమించే తీరు.. నివారణ మార్గాలపై సరైన అవగాహన లేకపోవడంతో గతంలో ఎన్నో అపోహలు ఉండేవి. అయితే ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అవగాహన కార్యక్రమాలు.. చికిత్సకు చేయూత చేపడుతున్న చర్యలతో మహమ్మారి క్రమక్రమంగా దూరమవుతోంది. ఎయిడ్స్ వ్యాధి తీవ్రతలో రాష్ట్రంలో జిల్లా ఎనిమిదో స్థానంలో ఉంది. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కథనం..



నెల్లూరు సిటీ: ఎయిడ్స్ మహమ్మారి నియంత్రణకు ప్రభుత్వం పోరాటం చేస్తోంది. గతంలో భారీ సంఖ్యలో ఉండే రోగులు నేడు వేళ్లపై లెక్కబెట్టే స్థితికి వచ్చింది. ఎయిడ్స్ బాధితులకు చికిత్సను కొనసాగిస్తూ.. వారికి మందులను ఏఆర్టీల ద్వారా ఉచితంగా అందజేస్తున్నారు. ఎయిడ్స్ మహమ్మారిని పారదోలేందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు చేపడుతున్న కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. మరోవైపు ఏటా కొత్త కేసులు నమోదవుతుండటం కొంత ఆందోళన కలిగిస్తోంది. ఇందులో గర్భిణులూ ఉంటున్నారు.

17.8 నుంచి 0.5 శాతానికి..

- జిల్లాలో 2002లో హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు 17.8 శాతం ఉండగా.. 2022 నాటికి 0.5 శాతానికి తగ్గుముఖం పట్టింది.
- 2002లో గర్భిణుల్లో హెచ్ఐవీ 2.7 శాతం ఉండగా.. 2023కి 0.02 శాతానికి తగ్గింది.

ఏడాది	పరీక్షల సంఖ్య	నిర్ధారణైనవి
2018 - 19	1,34,397	1,174
2019 - 20	1,31,914	1,007
2020 - 21	70,966	577
2021 - 22	1,50,467	710
2022 - 23	1,91,042	811
2023 - 24	1,10,538	465

- జిల్లాలో 12 వేల మంది ఎయిడ్స్ బాధితులు మందులతో తమ జీవితాన్ని నెట్టుకొస్తున్నారు. ఏఆర్టీ కేంద్రాల్లో 10798 మంది మందులు వాడుతున్నారు.

ప్రెప్‌తో నియంత్రణ

ప్రీ ఎక్స్‌పోజర్ ప్రొఫిలాక్సిస్ (ప్రెప్) ద్వారా ఇన్‌ఫెక్షన్ దాదాపు సున్నా శాతానికి వచ్చేలా డాక్టర్లు చర్యలు చేపడుతున్నారు. దీని ద్వారా ఎయిడ్స్ రోగులు సైతం అందరిలాగే తమ జీవిత కాలాన్ని పొడిగించుకుంటున్నారు. ప్రెప్‌కు సంబంధించిన మందులను నెల్లూరులోని వీహెచ్ఎస్ అనే స్వచ్ఛంద సంస్థ తక్కువకే అందిస్తోంది. మార్కెట్లో దీని ధర రూ.రెండు వేలకుపైగా ఉన్నా, రూ.800కే అందజేస్తున్నారు.

అవగాహనతోనే పూర్తిగా నియంత్రణ



ప్రజల్లో అవగాహన, సామాజిక చైతన్యం ఉన్నప్పుడే ఎయిడ్స్‌ను పూర్తిస్థాయిలో నియంత్రించొచ్చు. ప్రస్తుతం చాలా వరకు అవగాహన ఏర్పడింది. 2025 నాటికి పూర్తిస్థాయిలో అరికట్టాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం.
– ఖాదర్‌వలీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి

అవగాహన ర్యాలీ నేడు

ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గాంధీబొమ్మ సెంటర్ నుంచి టౌన్‌హాల్ వరకు ర్యాలీని శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకు నిర్వహించనున్నామని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సీఎం జగన్‌కే ప్రజామోదం



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యేలు మానుగుంట మహీధర్‌రెడ్డి, ప్రతాప్‌కుమార్‌రెడ్డి

• రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు

కావలి: రాష్ట్రానికి జగన్‌మోహన్‌రెడ్డే మరోసారి సీఎం కావాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుకుంటున్నారని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు పేర్కొన్నారు. పట్టణంలోని ఎనిమిదో వార్డులో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి గురువారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డితో కలిసి బీద మస్తాన్‌రావు హాజరయ్యారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించడంతో పాటు లబ్ధిని తెలియజేసే బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మస్తాన్‌రావు మాట్లాడారు. పేదల కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందని కొనియాడారు. సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపడంతో పాటు సామాజిక సాధికారత దిశగా పాలనలో అన్ని వర్గాలను భాగస్వామ్యం చేయడం ద్వారా సరికొత్త చరిత్రకు సీఎం శ్రీకారం చుట్టారని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ ఘన విజయం ఖాయం

రాష్ట్రంలో ఎన్నికలెప్పుడు జరిగినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి పేర్కొన్నారు. సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో జగన్‌మోహన్‌రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. 2024 ఎన్నికల్లో కావలి ఎమ్మెల్యేగా ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఘన విజయం సాధిస్తారన్నారు.

కావలి కనకపట్నంగా మారడం తథ్యం

సీఎం సారథ్యంలో కావలి కనకపట్నం కావడం తథ్యమని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందుకు రామాయపట్నం పోర్టే తొలి అడుగు అని తెలిపారు. నియోజకవర్గంలో భారీగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని వివరించారు. నేతలు షాహుల్ హమీద్, ఖమర్‌బాబు, నల్లూరు రమేష్, రహీమ్ బేగ్, పర్వీన్‌జానీ, భైరవ, జమ్మూ, షమ్నా, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు భూ పంపిణీయే లక్ష్యం



పట్టాను పంపిణీ చేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

జలదంకి: అర్హులైన ప్రతి ఒక్కరికీ భూమిని అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని లబ్ధిదారులకు అసైన్‌మెంట్ పట్టాలను స్థానిక పద్మావతి కల్యాణ మండపంలో గురువారం పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. మండలంలో 612 మంది లబ్ధిదారులకు 711.32 ఎకరాలను పట్టాలుగా అందజేస్తున్నామని చెప్పారు. త్వరలో మరింత మందికి వ్యవసాయ భూమి మంజూరు పత్రాలను పంపిణీ చేయనున్నామని వెల్లడించారు. రానున్న ఎన్నికల్లో పార్టీని గెలిపించాలని కోరారు. కావలి ఆర్డీఓ శీనానాయక్, తహసీల్దార్ రమణరావు, పార్టీ మండల కన్వీనర్ మాలకొండారెడ్డి, జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, నేతలు రావి ప్రసాద్‌నాయుడు, ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, రామిరెడ్డి, కృష్ణారెడ్డి, గండు కృష్ణారెడ్డి, దామెర్ల దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ నుంచి పడి మహిళకు గాయాలు



చికిత్స పొందుతున్న సుందరమ్మ

అల్లూరు: బైక్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తూ కింద పడటంతో మహిళ గాయపడిన ఘటన స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలోని పోలేరమ్మ చెట్టు వద్ద గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. అల్లూరు మండలం ఇందుపూరు దళితవాడకు చెందిన దుగ్గులూరు సుందరమ్మ, ఆమె కుమారుడు దగదర్తిలో వారి బంధువుల వివాహానికి బైక్‌పై వెళ్లారు. ఈ క్రమంలో తిరిగొస్తుండగా, పోలేరమ్మ చెట్టు వద్ద కొత్తగా వేసిన స్పీడ్ బ్రేకర్ వద్ద వేగాన్ని నియంత్రించలేకపోయారు. దీంతో వెనుక కూర్చొన్న సుందరమ్మ కిందపడి గాయపడ్డారు. స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా, మెరుగైన వైద్యం నిమిత్తం నెల్లూరు తరలించారు.

రూ. 800 కోట్లతో వెంకటగిరి అభివృద్ధి

• నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న రామ్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు (సెంట్రల్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్తగా తాను బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రూ.800 కోట్లతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టానని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని చెప్పారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 75 వేల కుటుంబాలను కలిశానని, తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యనూ సాధ్యమైనంత మేర పరిష్కరించానని చెప్పారు. మిగిలిన వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నానని వెల్లడించారు. నియోజకవర్గంలోని పంగిలి వద్ద రూ.12 కోట్లతో రహదారి, సైదాపురం నుంచి డేగపూడి వరకు రూ.45 కోట్లతో రహదారి పనులు, వెంకటగిరిలో రూ.2.5 కోట్లతో సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించనున్నామని, అదే విధంగా రూ.110 కోట్లతో జలజీవన్ మిషన్ ద్వారా తాగునీటి పనులను చేపట్టనున్నామని వెల్లడించారు. నియోజకవర్గంలో 1800 టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు త్వరలో అందజేయనున్నామన్నారు. నియోజకవర్గంలో ఎక్కడైనా అక్రమంగా మైనింగ్ జరుగుతోందనే పూర్తి సమాచారంతో తన వద్దకు వస్తే దగ్గరుండి అడ్డుకుంటానని తెలిపారు. ఆడుదాం – ఆంధ్రా పోటీల్లో నియోజకవర్గ క్రీడాకారులు మొదటి వరుసలో ఉంటారని చెప్పారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

అనుమసముద్రంపేట: సచివాలయ సిబ్బంది తమ పనితీరును మెరుగుపర్చుకొని ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం అమలు చేసే పథకాలను అర్హులకు చేరువ చేయాలని జెడ్పీ సీఈఓ చిరంజీవి పేర్కొన్నారు. మండలంలోని జమ్మవరం సచివాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల పోస్టర్లు, రికార్డులను పరిశీలించారు. సచివాలయం ద్వారా ప్రజలకు అందించే మందులను పరిశీలించి.. ఏఎన్ఎం ద్వారా బీపీ పరీక్ష చేయించుకున్నారు. ఈ – సర్వీసుల రుసుమును ప్రభుత్వానికి జమ చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి హరి, ఏఎన్ఎం సింధూర, డిజిటల్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు



సజ్జలకు వినాయకుడి విగ్రహ బహూకరణ

నెల్లూరు (టౌన్): విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు, మార్పులను తీసుకొచ్చి.. పేదలకు విద్యావకాశాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలలు, కాంట్రాక్ట్ అధ్యాపకులతో ఆత్మీయ సమావేశాన్ని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని డీఆర్ ఉత్తమ హోటల్లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడారు. ఉపాధ్యాయులకు మేలు చేసే ప్రతి అంశాన్నీ నెరవేర్చామని చెప్పారు. సీఎం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు విద్య, ఉపాధ్యాయ రంగం మద్దతు తెలపడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. సీఎం మాటిచ్చారంటే అది ఎంత కష్టమైనా నెరవేరుస్తారని చెప్పారు. అనంతరం రామకృష్ణారెడ్డిని సత్కరించారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు

నెల్లూరు(పొగతోట): గ్రామీణ ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను ఈ నెల 15 వరకు నిర్వహించనున్నామని డీపీఓ సుస్మితారెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దోమలు ప్రబలకుండా చర్యలు చేపడతామని చెప్పారు. పారిశుధ్య కార్యక్రమాలను ప్రత్యేక శ్రద్ధతో నిర్వహించేలా ఈఓపీఆర్డీలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామస్తులకు నిరంతరం అందుబాటులో ఉండేలా ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 37 మండలాలకు ప్రత్యేకాధికారులను నియమించామని పేర్కొన్నారు.

కండలేరులో నీటి నిల్వ

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 11.085 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వరదకాలువ నుంచి జలాశయానికి 605 క్యూసెక్కుల నీరు చేరుతోందని చెప్పారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 40, పిన్నేరు వాగు, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు ఐదు చొప్పున, లోలెవల్ స్లూయిజ్‌కు 235 క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని వివరించారు.

బస్సును ఢీకొన్న మినీ లారీ





ధ్వంసమైన వాహనాలు

సంగం: ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును మినీ లారీ ఢీకొన్న ఘటన మండలంలోని సిద్ధీపురం వద్ద నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. వివరాలు.. రహదారి పక్కన ఆర్టీసీ బస్సును నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోసాగారు. ఈ క్రమంలో వెనుక నుంచి లారీ ఢీకొంది. లారీ డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ప్రమాదం జరిగిందని ప్రయాణికులు తెలిపారు. అనంతరం ప్రయాణికులను మరో బస్సు ద్వారా తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.